క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల అడ్డగింత



పైప్‌లైన్ పనులను అడ్డుకుంటున్న ఇరవెండి రైతులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ పైప్‌లైన్ పనులను ఇరవెండి గ్రామానికి చెందిన కొందరు రైతులు అడ్డుకున్నారు. తమ భూముల నుంచి పైప్‌లైన్ పనులు చేయాలంటే తమకు నష్టపరిహారమందించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి పైప్‌లైన్ పనులను కొందరు రైతులు అడ్డుకున్నారు. పురుగుమందు డబ్బాలు చేతబట్టి.. తమకు పరిహారం ఇవ్వకుండా పనులు జరిపిస్తే పురుగుమందు తాగుతామని హెచ్చరించారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

ప్రమాద బాధితులకు రూ.లక్ష సాయం

ములకలపల్లి: రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు రాష్ట్ర పశు వైద్యుల సంఘం బాసటగా నిలిచింది. గత నెల 17వ తేదీన పాల్వంచ నుంచి విద్యార్థులతో వస్తున్న ఆటోను ఎదురుగా కారు ఢీ కొన్న విషయం విదితమే. ఈ సంఘటనలోని బాధిత కుటుంబాలను పశువైద్యుల సంఘం నాయకులు కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు బాణోతు కోటేశ్వరరావు, సీనియర్ డాక్టర్లు బద్దూలాల్, సంతోశ్, స్థానిక పశువైద్యాధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నగదును సమీకరించారు.

21న స్వర్ణోత్సవ సభ

గుండాల: ఈనెల 21న ఖమ్మంలో, 24న హైదరాబాద్‌లో జరుగు పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ భాస్కర్, పీవైఎల్ మండల అధ్యక్షుడు తాటి రమేష్‌లు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యల కోసం, విద్యా హక్కుల కోసం, శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపనే ధ్యేయంగా ఉద్యమిస్తోందన్నారు. సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాజేష్, ప్రవీణ్, ఈసం రమేష్, ఈసం సుధాకర్, అరెం రామారావు, కల్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులు పంపిణీ

గుండాల: జ్వరాలు వచ్చి కీళ్లనొప్పులు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న బాధితులకు వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్, మానాల బ్రదర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 800 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ గ్రీన్‌ఫీల్డ్ అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు ఆ మందులను హైదరాబాద్ నుంచి తెప్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాజమౌళి, క్లబ్ సభ్యులు మానాల నారాయణ మూర్తి, మానాల ప్రభాకర్, మానాల వీరన్న, మానాల సతీష్, మానాల శ్రావన్, తవిడిశెట్టి నాగరాజు, రాంబాబు, శ్రీశైలం, తాటిపల్లి సత్యం, వీరన్న, పూజిత్, నాగమల్లయ్య, శరత్, సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ సభ్యులు పాపాచారి, తిరుపతి, నారాయణ, రాజు, యాకయ్య, రంజిత్, డీ.శ్రీను, నరేష్, మాజీ ఎంపీపీ ముక్తి సత్యం పాల్గొన్నారు.

మకరతోరణం బహూకరణ

మణుగూరుటౌన్: సాయినగర్‌లోని విజయ విఘ్నేశ్వర స్వామికి అశ్వాపురం మండలానికి చెందిన సూదిరెడ్డి విజయేందర్ విష్ణుకుమారి దంపతులు శుక్రవారం మకరతోరణం బహూకరించారు. వారి కుమారుడు ఉద్యోగం లభించిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు రెండు కేజీల వెండితో కూడిన రూ.1.96 వేల విలువైన మకర తోరణం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా, విజయ విఘ్నేశ్వర ఆశీస్సులు కలగాలని ఆశిస్తూ ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, అర్చకులు సంతోష్ పవన్‌కుమార్, సాయి గణ శర్మలు దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాతల కుమార్తె మృదుల రెడ్డి, కుమారుడు ముకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

గుండాల: మండలంలోని పాలగూడెం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని వజ్జ వీరకుమారికి ఇల్లందు ఆదివాసీ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికుటుంబీకులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో ఆదివాసీ హెల్ప్ లైన్ అధ్యక్షుడు కుర్సం అంజయ్య, కార్యదర్శి కుంజా కృష్ణ ఆధ్వర్యంలో చదువు ఖర్చుల నిమిత్తం రూ.12వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరకుమారికి ఆదర్శంగా తీసుకుని గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పూనెం బాలరాజు, ఈసం శ్రీనివాస్, కల్తి సాంబయ్య, అరెం రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- గ్రామాల్లో విచ్చలవిడిగా నాటుసారా
- మద్యానికి బానిసలవుతున్న జనం
- ప్రాణాలు గాల్లో.. సంసారాల్లో నిప్పు


బూర్గంపాడు: పచ్చని పల్లెల్లో నాటుసారా చిచ్చురేపుతుంది. నాటుసారాకు బానిసలై ఎంతోమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే పలు కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయాయి. గతంలో కొంతమేరా గుడుంబాను కట్టడి చేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులు.. ప్రస్తుతం మొక్కుబడి దాడులకే పరిమితమవుతున్నారు. దీంతో గ్రామాల్లో నాటుసారా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో నాటుసారా తయారీ చేసి గ్రామాలలోకి తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ప్రభుత్వం విక్రయించే మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో మద్యం ప్రియులు నాటుసారా తాగేందుకే మొగ్గుచూపుతున్నారు.

మారుమూల ప్రాంతాల్లో తయారీ

నాటుసారాను మారుమూల ప్రాంతాల్లో గుట్టుగా తయారుచేస్తున్నారు. నాటుసారాను తయారు చేసిన తరువాత దానిని ప్యాకెట్లు చేసి రాత్రివేళల్లో టూవీలర్స్, ఆటోల్లో గ్రామాలకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ఈ అక్రమ రవాణా సాగుతుంది. గ్రామాల్లో సారా విక్రేతలకు ప్యాకెట్ ఒక్కటికి రూ.10ల చొప్పున సరఫరా చేస్తున్నారు. వారు దానిని ప్యాకెట్ రూ.20లకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

తయారీలో రసాయనాల వినియోగం..

నాటుసారా తయారీలో విపరీతంగా కెమికల్స్ వాడుతుండటంతో గుడుంబా తాగేవారు అనారోగ్యం పాలవుతున్నారు. గతంలో నాటుసారా తయారీకి నల్లబెల్లం, విప్పపువ్వు, కుళ్లిన పండ్లు, కొన్ని చెట్ల బెరడులు, కొద్దిమేరా ఫెర్టిలైజర్లు వాడేవారు. అయితే ప్రభుత్వం నల్లబెల్లం విక్రయాలపై నిషేధం విధించటంతో ప్రస్తుతం నాటుసారా తయారీకి పంచదార, అమ్మోనియం సల్ఫేట్‌తో పాటుగా కొన్ని రకాల కెమికల్స్‌ను వాడుతున్నారు. కెమికల్స్‌తో తయారు చేసిన నాటుసారాను తాగిన మద్యం ప్రియులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆరోగ్యం క్షీణించి చిన్నవయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. కొంతరు కొన్ని నెలలకే మంచం పడుతున్నారు. లివర్ దెబ్బతిని కాళ్లు, చేతులు, ముఖం వాపు వచ్చి అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.



మారుమూల ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న దృశ్యం

వితంతువులవుతున్న మహిళలు

గ్రామాల్లో వృద్ధాప్య పింఛన్లు తీసుకునేవారి కంటె వితంతు పింఛన్లు తీసుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వితంతువు పింఛన్లు తీసుకునేవారిలో చాలామంది తమ భర్తలు నాటుసారాకు బలైన వారే కావటం గమనించాల్సి విషయం. నాటుసారాకు బానిసలై 30, 40 ఏళ్ల మధ్య వయసులోనే చాలామంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

కుటుంబాల్లో కలహాలు..

వ్యవసాయ పనులకు, హమాలీ పనులకు వెళ్లే రోజువారీ కూలీలు ఎక్కువగా నాటుసారాకు బానిసలవుతున్నారు. వారి సంపాదన మొత్తం సారా తాగేందుకే ఖర్చు చేస్తున్నారు. కూలీ డబ్బులు ఇళ్లలో ఇవ్వకపోవటంతో తరచు భార్యభర్తల మధ్య తగవులు, కొట్లాటలు చోటుచేసుకుంటున్నాయి. మద్యానికి బానిసలైన భర్తల వేధింపులు తట్టుకోలేక కొందరు భార్యలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో వారి పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. మద్యానికి బానిసలైన భర్తల వేధింపులతో మరికొందరు మహిళలు భర్తకు దూరంగా పిల్లలతో వేరుగా ఉంటున్నారు. మరోవైపు, సారా తాగేందుకు డబ్బులు లేనటువంటి సందర్భాలలో కొందరు చిన్నపాటి దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొందరు ఇళ్లలోని వస్తువులను గుట్టుగా దొంగతనం చేసి అమ్ముకుంటున్నారు. మరికొందరు వస్తువులను తనఖా పెట్టి మద్యం తాగుతున్నారు. నాటు సారా తయారీదారులు, విక్రేతలు లక్షల్లో సంపాదిస్తుంటే, దానిని తాగే కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.



తయారు చేసిన నాటుసారా ప్యాకెట్లు

అధికారులు స్పందించేనా..?

ప్రజారోగ్యం దృష్ట్యా ఎక్సైజ్‌శాఖ అధికారులు గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నజర్ పెట్టాల్సిన అవసరముంది. సారా విక్రయాలకు పాల్పడుతున్న వారిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు పెడితే తప్ప గుడుంబాను అరికట్టాలేనటువంటి పరిస్థితులున్నాయి. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా భారీ జరిమానా విధిస్తే కొంతమేరా గుడుంబాను అరికట్టే అవకాశాలున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

గుడుంబా తయారీ కేంద్రాలపై, విక్రేతలపై తరతూ దాడులు నిర్వహిస్తున్నాం. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా 18004252523 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. స్థానికంగా ఉండే ఎక్సైజ్ అధికారులకు కూడా సమాచారమిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– గణేష్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులంతా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థుల అసెంబ్లీలో పాల్గొన్నారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి ప్రతి విద్యార్థితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యాభివృద్ధికి పలు సూచనలు చేశారు. అలాగే కళాశాల రికార్డులు పరిశీలించి, కళాశాలలో ఉన్న సౌకర్యాలను తనిఖీ చేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, ఉత్తమ బోధన అందించి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అల్లు అనిత, అధ్యాపకులు అరవింద్, ఎస్‌కె.చాంద్‌పాషా, సత్య శ్రీధర్, నరసింహారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెజిస్ట్రేట్‌కు ఘన వీడ్కోలు

మణుగూరుటౌన్: సీనియర్ సివిల్ జడ్జిగా వికారాబాద్‌కు ప్రమోషన్‌పై వెళ్తున్న మణుగూరు ఫస్ట్‌క్లాస్ ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వర్లుకు మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏడాదిన్నర పాటు ఇక్కడ పనిచేసి భద్రాచలం బదిలీ అయ్యి మణుగూరు ఇన్‌చార్జ్‌గా సేవలందిస్తున్న జడ్జి మీసాల వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కవిత, సర్వేశ్వరరావు, రుద్ర వెంకట్, సీనియర్ న్యాయవాదులు నగేశ్, జాడిచొక్కారావు, కందిమళ్ల నర్సింహారావు, వాసవి తదితరులు ఉన్నారు.



జడ్జి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు

బదిలీ అధికారికి సన్మానం



ఏఈ లక్ష్మీనర్సింహారావును సత్కరిస్తున్న దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లి ట్రాన్స్‌-కో ఏఈగా విధులు నిర్వహించి, చుంచుపల్లికి బదిలీపై వెళ్లిన లక్ష్మీనర్సింహారావుకు శుక్రవారం పౌరసన్మానం చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్ ఏఈ సేవలను కొనియాడారు. అనంతరం పూలమాల వేసి, దుశ్శాలువతో సత్కరించారు. తొలుత ఆలయ అర్చకుడు విస్సావజ్జల సురేశ్ శర్మ ఏఈ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేసి, ఆశీర్వచనం అందజేశారు. పువ్వాల మంగపతి, శనగపాటి సీతారాములు, కరుటూరి కృష్ణ, పేటేటి నిర్సింహారావు, అయితా శేషగిరిరావు, బిక్కుమళ్ల వేణు, పద్దం బుజ్జి, కొదుమూరి వీరగోపాల్, కొదుమూరి నాగయ్య, ఎండి.యూసఫ్, దేవ్‌సింగ్, నరాటి సత్యం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకలవ్య బాలుర, బాలికల హాస్టల్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య సందర్శించారు.

ఈ సందర్భంగా హాస్టల్లోని వంటగది, పిల్లల డార్మెటరీస్, సిక్ రూమ్, టాయిలెట్స్ ను, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్కూల్ స్టాఫ్, పిల్లలతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే పరిశుభ్రమైన, తాజా అయిన ఆహారం, నీరు మాత్రమే స్వీకరించాలని సూచించారు. హాస్టల్ పరిసరాల్లో నీరు ఎక్కడా నిలువ లేకుండా చూడాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం దుర్గా దేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మణుగూరురూరల్: 11 కేవీ సబ్ స్టేషన్‌లో 3వ శనివారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మణుగూరు శివలింగాపురం, గాంధీబొమ్మ సెంటర్, రాజుపేట, బాపనకుంట, కొత్త కొండాపురం, బండారుగూడెం మెయిన్ రోడ్ సబ్ స్టేషన్ నుంచి రెండు వైపులా అంబేడ్కర్ సెంటర్ వరకు ఆదర్శనగర్, ఐలమ్మనగర్, శేషగిరినగర్, వినాయక నగర్ తదితర అన్ని ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరకగూడెం: నేడు మండల 33/11కేవి సబ్ స్టేషన్లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8:00 గంటల నుంచి 11:00 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనునట్లు కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పడవ వేలం

చర్ల: మండలంలోని పెద్దిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జెట్టిగూడెం నుంచి మణుగూరు మండలంలోని సింగారం వరకు గోదావరి నదిపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పడవ నడుపేందుకు గాను వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సామ్రాజ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేళంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు ఈ రోజు (శనివారం)ఉదయం 10 గంలకు పెద్దిపల్లి గ్రామపంచాయతీలో హాజరు కావాలని ఆమె కోరారు. వేలంలో షెడ్యూల్ తెగలకు చెందిన వారు మాత్రమే పాల్గొనాలని, పడవ నడుపడానికి తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని, గతంలో పంచాయతీకి ఎటువంటి బాకాయిలు పడి ఉండకూదని వివరించారు.

పశు వైద్యుల కేటాయింపు

దమ్మపేట: మండల పరిధిలో ఉన్న మూడు పశు వైద్య కేంద్రాలకు ముగ్గురు పశు వైద్యులను శుక్రవారం కేటాయించారు. మండల పరిధిలోని దమ్మపేట వైద్య కేంద్రానికి యు.తేజారాణి, పట్వారిగూడెం వైద్య కేంద్రానికి ఎమ్.ప్రశాంత్, నాగుపల్లి వైద్య కేంద్రానికి ఈ.శ్యామ్‌బాబులు నియమితులయ్యారు. చాలా కాలంగా కేవలం ఇన్‌చార్జ్ వైద్యులతో నెట్టుకొస్తున్న పశు వైద్య కేంద్రాలకు వైద్యుల నియాయకంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పునరావాసం కల్పించాలని వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రామాలయం మాడవీధుల అభివృద్ధి కోసం స్థానికులు, అక్కడి వ్యాపారుల పొట్ట కొట్టొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పార్టీ నాయకులు అన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయ వ్యాపార, గృహ సముదాయాలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండారు శరత్ బాబు, సున్నం గంగా, రత్నం, గంగా, సుధా, సీత, రాము, వాసు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

బూర్గంపాడు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. సారపాకలోని గాంధీనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి గాంధీనగర్‌లోని ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. ఇళ్లలోని వాహనాలను తనిఖీ చేసి డాక్యుమెంట్లను పరిశీలించారు. 22 మోటార్‌సైకిళ్లు, 3 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సరైన డాక్యుమెంట్స్ లేనటువంటి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేసిన, విక్రయించిన, సేవించిన జైలుశిక్ష తప్పదన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. వాహనాలు, బంగారు అభరణాలు, సెల్‌ఫోన్‌ల చోరీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు, నేరాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్ఐలు రాజేష్, ప్రవీణ్, విజయ, రాజశేఖర్, సురేష్, పాల్వంచ, మణుగూరు పోలీస్ సబ్ డివిజన్‌ల పోలీసులు పాల్గొన్నారు.



సారపాక గాంధీనగర్‌లో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీస్ అధికారులు

ఎస్టీ జాబితాలో కలపాలి

మణుగూరుటౌన్: ఏజెన్సీలో ఉన్న గౌడులకు 1950, 56 చట్టం, 342 జీవో 2014, 2015 ప్రకారం గౌడ కులస్తులందరినీ ఎస్టీ జాబితాలో కలిపి సర్టిఫికెట్లు ఇవ్వాలని నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. శుక్రవారం స్నేహా గార్డెన్‌లో జరిగిన పినపాక నియోజకవర్గ గౌడ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌడలు తాటి చెట్టు ఎక్కుతూ ఎటువంటి ఆధారం లేకుండా కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. సొసైటీ లేకపోవడం వల్ల ప్రమాదం జరిగితే ఎటువంటి ఆదరణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ఉన్న సొసైటీలు పునరుద్ధరణ చేసి సొసైటీలు ఇప్పించి గౌడ కులస్తులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని గుండాల, మర్కోడు, పినపాక, మణుగూరు, జానంపేట మండల నాయకులు వెంకటేశ్వర్లు, సోమనర్సయ్య, మల్లేష్, రమేశ్, రాములు, మేకపోతుల నర్సింహారావు, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలిశారు. హైదారాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. బీటీ రహదారులతోపాటు అంతర్గత రోడ్ల నిర్మాణాలకు రూ.51 కోట్ల రూపాయాల ప్రతిపాదనలను అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించనట్లు ఎమ్మెల్యే జారే తెలిపారు.

తడి, పొడి చెత్తపై ప్రచారం



టీస్టాల్‌లో తడి, పొడి చెత్తకు సంబంధించిన పోస్టర్‌ను అతికిస్తున్న వావ్ సంస్థ బాధ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో శుక్రవారం ఐటీసీ వావ్ (ఈ-శ్రీ ఫౌండేషన్) ఆధ్వర్యంలో జనవాసాల సంచారం ఎక్కువ ఉన్న ప్రదేశాలలో తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా చేసుకోవాలని పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా పోగ్రాం కో-ఆర్డినేటర్ రమ్య మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో ఉన్న అన్ని కాలనీల ప్రజలు తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని, వీటిని ఎలా వేరు చేయాలో ఇప్పటికే ప్రత్యక్షంగా వావ్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కో-ఆర్డినేటర్లు సౌజన్య, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచాలి

దుమ్ముగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10నెలలు పూర్తి కావస్తున్నా సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న రైతాంగానికి నష్టపరిహారం పెంచకపోవడం దురదృష్టమని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర రావు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని ఎకరానికి రూ.8 లక్షల కంటితుడుపు పరిహారం కొదరికే ఇచ్చిందని, ఈ ప్రభుత్వమైన ఎకరాకు రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

గుండాల: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రజాపంథ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్, ఏఓలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట చేతికొచ్చిందని, మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం పంటలకు మద్దతు ధర కల్పించి, ప్రైవేటు వ్యాపారుల మోసాల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, మాచర్ల సత్యం, ఈసం సింగయ్య, ఈసం క్రిష్ణ, సన్ప సుగుణారావు, జగన్, లక్ష్మయ్య, రామన్న పాల్గొన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు పోరాడుదాం

మణుగూరు రూరల్: మహిళలపై హింస అత్యాచారాలు వేధింపులకు వ్యతిరేకంగా, మహిళా హక్కుల పరిరక్షణకు ఐద్వా పోరాడుతుందని ఐద్వా మండల కార్యదర్శి పద్మ అన్నారు. శుక్రవారం బొడె పూడి నగర్ మహిళలతో ఆమె మాట్లాడుతూ.. మహిళల సమానత్వం కోసం, 33శాతం రిజర్వేషన్ అమలు కోసం ఐద్వా ఉద్యమిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు పథకాలలో మహిళలకు నెలకు 2500 తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో జరగబోయే 4వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కత్తిష కమల, పద్మ ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

రైతులు మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గుండాల: ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని, దళారులను ఆశ్రయించొదని జీసీసీ మేనేజర్ నర్సింహారావు, ప్రత్యేక అధికారి సమ్మయ్య, తహసీల్దార్ ఇమ్మానుయేల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జీసీసీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'ఏ'రకం ధాన్యం క్వింటాకు రూ.2320, సాధారణ రకం ధాన్యం రూ.2300లకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు బోనస్ కింద రూ.500లు చెల్లించడం జరుగుతుందన్నారు. తేమశాతం 17 ఉండాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25న మాలమహానాడు పాదయాత్ర

భద్రాచలంఅర్బన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళితుల ఐక్యత కోసం ఈనెల 25న జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో జరగనున్న మాలల పాదయాత్రకు వేలాదిగా మాలలు తరలిరావాలని జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ అశోద భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు మల్ల సుందర్‌రావు అధ్యక్షతన ఆ కరపత్రాల ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాతీయ కార్యదర్శి భాస్కర్ ముందుగా అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి తోటమల్ల రమణమూర్తి, పాదయాత్ర కమిటీ బాధ్యుడు, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎడెల్లి గణపతి, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్, జిల్లా మహిళా నాయకురాలు బోడ దివ్య, మేకల శేషమ్మ, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు దారా చిరంజీవి, జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు